పాఠశాలల పనివేళల పెంపుపై ఆందోళన

- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు పనివేళలు
- పైలెట్ ప్రాజెక్టుగా నియోజకవర్గంలో 3 పాఠశాలల ఎంపిక
- దూరప్రాంత విద్యార్థుల ఇబ్బందులు
- తిరోగమన విధానాలంటూ ఉపాధ్యాయుల ఆగ్రహం



పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన పెదనింద్రకొలను జెడ్పీ స్కూల్


తిమ్మయ్యపాలెం నుంచి సైకిల్‌పై కైకరం జెడ్పీస్కూల్‌కు వస్తున్న బాలికలు

నిడమర్రు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని వేళలు గురువారం నుంచి ఒక గంట అదనంగా పెరిగింది. ఇప్పటి వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 8 పీరియడ్స్‌లో పాఠశాల కాల నిర్ణయ పట్టిక ఉంది. తాజాగా పాఠశాల కాల నిర్ణయ పట్టిక ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంది. అదన గంటను పాఠశాల అసెంబ్లీ, మొదటి పీరియడ్, స్వల్ప విరామాలు, భోజన విరామాల సమయాలకు కేటాయించారు. పీరియడ్స్ సంఖ్య పాత పద్ధతిలోనే 8గా ఉంది. పని వేళలల్లో అదనంగా పెరిగిన ఒక గంట పని వేళలల వల్ల దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినుల భద్రత, రవాణా సౌకర్యాలపైనా ప్రభావం చూపుతుందని ఉపాధ్యాయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళా ఉపాధ్యాయులకు అదనంగా పెరిగిన గంట వల్ల బస్, ఆటో సౌకర్యాల సమస్యలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యాశాఖలో చేసే ప్రయోగాలు, అసంబంధ నిర్ణయాలతో పాఠశాల విద్య తిరోగమనదిశగా వెళుతుందని మండిపడుతున్నాయి.

పైలెట్ ప్రాజెక్టుగా 28 స్కూళ్లు

జిల్లాలో పైలెట్ ప్రజెక్టుగా 28 ఉన్నత పాఠశాలలను జిల్లా విద్యాశాఖాధికారులు ఎంపిక చేశారు. వీటిలో ఉంగుటూరు నియోజకవర్గంలోని పెదనింద్రకొలను, కై కరం, భీమడోలు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఉదయం 9 నుంచి 5 గంటల వరకు పాఠశాలల నూతన పని వేళలు మార్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలో తొలివిడతగా హైస్కూల్ ప్లస్‌గా ఉన్న 28 ఉన్నత పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా స్కూల్స్‌లో మారిన కాల నిర్ణయ పట్టికను గురువారం నుంచి ప్రారంభించాలని జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేశారు. తదనుగుణంగా ఆయా స్కూల్స్‌లోని టీచర్స్ ఉదయం 9 ముందు సాయంత్రం 5 గంటల తర్వాత ఫేసియల్ అటెండెన్స్ వెయాల్సుంది.

ఉపాధ్యాయ సంఘాల నిరసన

పాఠశాలల పని వేళల మార్పుపై ఉపాధ్యాయ సంఘాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే టీచర్స్ ఉమ్మడి సంఘం జాక్టో తరుపున జిల్లా అధికారులకు నిరసన తెలుపుతూ వినతి పత్రాలు అందజేశారు. గురువారం అమరావతిలో జరిగిన శాసన మండలిలో ఎమ్మెల్యే పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఈ అంశంపై మాట్లాడి ఉన్నత పాఠశాలల పని వేళలు మార్చాలనే అలోచన ఉపసంహరించుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయా సంఘాల నేతలు చెబుతున్నారు. పనివేళలు మార్చాలంటే విద్యార్థుల మానసిక స్థితి, సాయంత్రం 5 గంటల పైన సరైన రవాణా సౌకర్యం, బాలికలకు భద్రత, మహిళా టీచర్స్ సమస్యలు, విద్యార్థి తరగతి గదిలో ఎంత సమయం శ్రద్ధగా అభ్యసించే అవకాశం ఉంది అన్న అంశాలు ప్రభుత్వం పరిశీలించాలని టీచర్స్ కోరుతున్నారు. వివిధ రాష్ట్రాల్లో అమలౌతోన్న పని గంటలను పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని విద్యావేత్తలు, మానసిక వేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

రవాణా సౌకర్యం లేదు



ప్రైవేటు విద్యా సంస్థల్లో పనివేళలు సాయంత్రం 5 గంటల వరకు ఉన్నా, ఇంటికి చేరుకోవడానికి తగిన రవాణా సౌకర్యాలు ఉంటాయి. కానీ దూరంలోని గ్రామాల నుంచి వచ్చే ప్రభుత్వ విద్యార్థులకు ఆ పరిస్థితి లేదు. పెంచిన సమయం బోధనకు కాకుండా విరామాలకు కేటాయించడం వల్ల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఏమాత్రం ఉపయోగం లేదు.
– షేక్ రంగావలి, ఏపీటీఎఫ్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి

బాలికల భద్రతను దృష్టిలో పెట్టుకోవాలి



గణపవరంలోని బాలికల ఉన్నత పాఠశాలకు 7 కిలో మీటర్ల దూరం నుంచి సైకిళ్లపై జల్లికొమ్మర గ్రామం నుంచి విద్యార్థినులు వస్తుంటారు. సీతాకాలంలో 5.30 గంటలకే చీకటి పడుతుంది. చీకట్లో ఇంటికి చేరుకోవాల్సి వస్తుంది. సాయంత్రం 5 గంటల వరకు పాఠశాల నిర్వహిస్తే, ఇలా 3 నుంచి 8 కిలో మీటర్ల దూరంలోని గ్రామాల నుంచి సైకిళ్లపై వచ్చే ఉన్నత పాఠశాల బాలికల భద్రతను ప్రభుత్వం దృష్టిలో పెట్టుకుని తక్షణం ఈ నిర్ణయం విరమించుకోవాలి.
– బొడ్డు రమేష్, యూటీఎఫ్ జిల్లా నాయకులు, గణపవరం

క్లుప్తంగా

మెరుగైన సేవలు అందించాలి


అంగన్‌వాడీ కేంద్రాల పనితీరును పరిశీలిస్తున్న ప్రాజెక్టు డైరెక్టరు పద్మావతి

పెదపాడు : చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీల ద్వారా సమర్థవంతమైన సేవలు అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టరు కె.పద్మావతి అన్నారు. పెదపాడు మండలం అప్పనవీడులోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. ఆయా కేంద్రాల్లో అందుతోన్న సేవలపై ఆరా తీశారు. పోషకాహార నాణ్యతను పరిశీలించారు. అప్పనవీడు, కొక్కిరపాడు, వేంపాడు గ్రామాల్లో కార్యకర్తలకు పెరటితోట పెంపకంపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీఓ ఎంఎస్ రాజశేఖర్, సూపర్‌వైజర్ కె.కుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ట్రీ గార్డుల ఏర్పాటు


ట్రీ గార్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు వద్ద సర్వీస్ రోడ్డులోని 11 మొక్కలు నాటి గార్డులు ఏర్పాటుచేసినట్టు స్థానిక బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. గురువారం రామదండు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్, నర్సింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ట్రీ గార్డులు ఏర్పాటు చేశామని చెప్పారు.

వికార్ జనరల్ బాల సేవలు అభినందనీయం


ఫాదర్ బాలతో పీఠాధిపతి జయరావు

దెందులూరు: ఆర్‌సీఎం ఏలూరు పీఠంలో వికార్ జనరల్, ఫాదర్ పి.బాల అందించిన సేవలు అభినందనీయమని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. గురువారం సోమవరప్పాడు సెయింట్ జాన్ విద్యా సంస్థల్లో వికార్ జనరల్ పి.బాల 27 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయనను అభినందించారు. క్రీస్తు కృపతో ఏలూరు తొలి పీఠాధిపతి జాన్ ములగాడ ప్రస్తుత పీఠాధిపతి పొలిమేర జయరావు, గురువులు, విశ్వాసులు అందరి సహాయ సహకారాలతో తన వంతు కృషి చేశానని బాల గుర్తుచేశారు. ఆద్యంతం క్రీస్తు కృపకు పాత్రుడిగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక గురువులు సెయింట్ జాన్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాదర్ బాలను సత్కరించారు.

అభ్యసన సామర్థ్యాల పెంపునకు కృషి


చిలకంపాడులో వర్క్ బుక్కులను తనిఖీ చేస్తున్న డీఈఓ నారాయణ

గణపవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, వారి అభ్యసన స్థాయిలు పెంచడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని డీఈఓ ఇ.నారాయణ అన్నారు. గురువారం గణపవరం మండలం చిలకంపాడు ఎంపీయూపీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థుల నోటు పుస్తకాలు, ఇంటి పని పుస్తకాలను, వర్కు బుక్కులను, విద్యార్థుల అభ్యసన స్థాయిలను, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఆయన పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతను రుచి చూశారు. రోజూ మధ్యాహ్న భోజనం విద్యార్థులందరూ తినేలా చూడాలని హెచ్‌ఎంకు సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


పెదనింద్రకొలను జెడ్పీ స్కూల్లో మాట్లాడుతున్న ఎస్సై వీర ప్రసాద్

నిడమర్రు: విద్యార్థులు పత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నిడమర్రు ఎస్సై వీర ప్రసాద్ అన్నారు. మత్తు పదార్థాలు, చెడు అలవాట్లు వల్ల భవిష్యత్లో వచ్చే అనర్థాలపై గురువారం పెదనింద్రకొలను జెడ్పీ స్కూల్ విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అతిగా సెల్ వినియోగం, సైబర్ నేరాలు, గంజాయి, సిగిరెట్, మద్యపానం వల్ల నష్టపోయిన వివిధ ఘటనలు ఎస్సై వివరించారు. సదస్సులో నిడమర్రు పోలీసులతోపాటు ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గున్నారు.

విజిలెన్స్ దాడులు


స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

ఉంగుటూరు: విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఉంగుటూరులో దాడులు నిర్వహించారు. సత్యం టిఫిన్ సెంటర్‌లో గృహ అవసరాలకు వినియోగించే 6 సింటిండర్లను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నామని, యజమాని దాసరి పండుపై కేసు నమోదు చేశామని విజిలెన్స్ అధికారిణి కన్యాకుమారి తెలిపారు. స్వాధీనం చేసుకున్న సిలిండర్ల విలువ రూ.14,872 ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ కొల్లూరి వెంకట స్వర్ణ దుర్గ, వీఆర్‌ఓ కె.వెంకటేశ్వరరావు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

మహిళ అరెస్ట్, మద్యం బాటిళ్ల స్వాధీనం

భీమడోలు: భీమడోలు ఎక్సైజ్ శాఖ, ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భీమడోలు, ఉంగుటూరు మండలాల్లో విస్తృత దాడులు నిర్వహించారు. పూళ్ల, కురెళ్లగూడెం, అంబర్‌పేట, యల్లమిల్లి, చేబ్రోలు, ఉంగుటూరు గ్రామాల్లోని బెల్ట్ షాపులపై దాడులు చేశారు. పూళ్లకు చెందిన ఓ మహిళను అరెస్ట్ చేసి ఏడు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని షాపు కేసు నమోదు చేశారు. ఇటీవల 15 బెల్ట్, ఒక నాటు సారా, అక్రమ మద్యం కేసులు నమోదు చేశామని, 222 మద్యం సీసాలు, 10 లీటర్ల నాటు సారా, 18 మంది వ్యక్తులను అరెస్ట్ చేశామని సీఐ బి.సత్యనారాయణ తెలిపారు. ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరరావు, ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల రక్షణ చట్టాలపై అవగాహన


బధిరుల పాఠశాలలో విద్యార్థులతో జడ్జి ప్రసాద్

పెదపాడు : దివ్యాంగుల రక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. పెదపాడు మండలం ఏపూరులోని ఆదిత్య బధిరులు పాఠశాలను గురువారం రత్నప్రసాద్ సందర్శించారు. భోజనం, సదుపాయాలపై విద్యార్థులతో మాట్లాడారు. దివ్యాంగుల హక్కులు, రక్షణ చట్టాలను వివరించారు. సమస్యలుంటే 1098 ట్రోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్, 15100 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయవచ్చని సూచించారు. నూజివీడు ప్రభుత్వ ఈఎన్‌టీ వైద్యుడు పి.అజయ్‌కుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణ పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్ తెలిపారు. ఏపూరు ఆదిత్య బధిరుల పాఠశాలను ఆర్డీఓతోపాటు జిల్లా అధికా రులు గురువారం సందర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. భోజన వసతులపై ఆరా తీశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రామ్‌కుమార్, జిల్లా సంఘటిత విద్య, సహిత విద్యావనరుల అధికారి భాస్కర్‌లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నష్టదాయకం


సదస్సులో మాట్లాడుతున్న వైద్యాధికారిణి కల్యాణ్ మహేశ్వరి

భీమడోలు: బాల్య వివాహాలను నియంత్రణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పూళ్ల వైద్యాధికారిణి ఈ.కల్యాణ్‌మహేశ్వరి అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ క్రాఫ్ట్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సహకారంతో బాల్య వివాహాలను అరికట్టడంపై తల్లిదండ్రులు, వివిధ శాఖల సిబ్బందికి అవగాహన సదస్సు క్రాఫ్ట్ జిల్లా సమన్వయకర్త ఆర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కల్యాణ్ మహేశ్వరి మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వివాహాలు చేస్తే బాలికలు చదువుకుని సంతోషంగా గడపాల్సిన తరుణంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు బాధ్యత వహించాలని కోరారు. గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నూర్జహాన్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామ స్థాయిలో బాల్య వివాహలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. బాల్య వివాహాలు జరిగితే 1098కు లేదా 112కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు. పూళ్ల హెచ్‌ఎం పెనుగొండ భువనేశ్వరరావు మాట్లాడుతూ 18 ఏళ్లలోపు వారికి వివాహం చేస్తే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీపీయూ జిల్లా యూనిట్ ప్రతినిధి పి.రాజేష్, క్రాఫ్ట్ కోఆర్డినేటర్ ఎస్ రవిబాబు, ఐసీడీఎస్, వైద్య ఆరోగ్య శాఖ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

దత్తత మాసోత్సవాల అవగాహన ర్యాలీ



పోతునూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

దెందులూరు: దత్తత అనేది చట్టపకారం తీసుకునే చర్య అని పోస్టర్ కేర్ గృహ మేనేజర్ కె.భార్గవి అన్నారు. దత్తత మాసోత్సవాల్లో భాగంగా పోతునూరు గ్రామంలో డీసీపీయూ యూనిట్, ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది కమ్యూనిటీ లెవెల్ ప్రోగ్రాం నిర్వహించారు. దత్తత నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరంగా శిక్షార్హులని భార్గవి హెచ్చరించారు. అనంతరం సునీత, రాజ్ కుమార్, మాధవి, ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పల ఇరుముడులు


ఆలయంలో ఇరుముడి పూజలు చేస్తున్న స్వాములు

దెందులూరు: స్వామియే శరణం మయ్యప్ప అంటూ 45 రోజుల కఠిన దీక్ష పూరిచేసిన గాలాయగూడెం గ్రామానికి చెందిన అయ్యప్ప మాలధారులు గురుస్వాముల ఆధ్వర్యంలో గాలయగూడెం గ్రామదేవత శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో ఇరుముడులు ధరించారు. ప్రత్యేక పూజల అనంతరం శబరిమల యాత్రకు బయలుదేరి వెళ్లారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం


విజేతలతో ఎంపీడీఓ పద్మావతీదేవి, సీఐ సత్యనారాయణ తదితరులు

భీమడోలు: పుస్తక పఠనం ద్వారానే విజ్ఞాన సంపత్తి సిద్ధిస్తుందని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవి, ఎక్సైజ్ సీఐ బి.సత్యనారాయణలు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. వివిధ పోటీల్లో విజేతలైన 150 మందికి బహుమతి ప్రదానం చేశారు. చదవడం మాకిష్టం, డిజిటల్ గ్రంథాలయాలు అనే అంశంపై వక్తలు మాట్లాడారు. కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా ఎంపీడీఓ పద్మావతీదేవి, ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, లా అండ్ ఆర్డర్ ఎస్సై వై.సుధాకర్, ఎక్సైజ్ ఎస్సై బి.శివదర, ఎంఈఓ అయినపర్తి భాస్కర్‌కుమార్, సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారథి, విద్యావేత్త జటావల్లభుల సాయిరామ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఒత్తిడి లేని విద్య గ్రంథాలయాల వల్లే సాధ్యమని, మంచి పుస్తకం వంద మంది స్నేహితులతో సమానమని వివరించారు. తెలుగు భాషా ఔన్నత్యాన్ని చాటుతూ తెలుగు అధ్యాపకుడు జె.సాయిరామ్ పాటిన పద్యాలాపన ఆకట్టుకుంది. అనంతరం పలువురికి దుశ్శాలువా కప్పి మెమెంటోలను అందజేశారు. తొలుత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీఓ కె.పద్మ, ఉత్తమ ఉపాధ్యాయుడు మండే సుధాకర్, మానవత కన్వీనర్ గుల్ల నూకరాజు, ప్రిన్సిపాల్స్ యలమర్తి రవీంద్రకుమార్, కె.ప్రేమ్‌కుమార్, బొమ్ము రవికుమార్, పోలిశెట్టి సత్యనారాయణ, ఎం.ఉదయ్, పి.బాలు, ఫోటోగ్రాఫర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మారావు తదితరులు పాల్గొన్నారు.


మిలటరీలో సేవలందించిన రాజును సన్మానిస్తున్న షరీఫ్

భవిష్యత్తు అంతా డిజిటల్ విప్లవమే

దెందులూరు: భవిష్యత్తు అంతా డిజిటల్ విప్లవమే అని దెందులూరు మండలం పంచాయతీల విస్తరణ అధికారి షరీఫ్ అన్నారు. గురువారం పోతునూరు గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సమావేశం గ్రంథాలయ అధికారి జి.రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పూర్తిస్థాయిలో నేర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా మిలటరీలో 24 ఏళ్లు సేవలందించి స్వగ్రామానికి వచ్చిన సైనికుడు నాగురు రాజును గ్రంథాలయంలో పౌర సన్మానం చేశారు. శాలువా, పూల దండలు, బొకేలతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

కంప్యూటర్ కోర్సు సర్టిఫికెట్ల ప్రదానం


అభ్యర్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో 45 రోజుల బేసిక్స్ ఆన్ కంప్యూటర్స్ సర్టిఫికెట్ కోర్స్ పూర్తిచేసిన మొదటి బ్యాచ్ విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లను ప్రదానం చేశామని ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. నారాయణపురం చుట్టుపక్కల గ్రామాల్లోని 100 మందికి పైగా నిరుద్యోగ యువతి యువకులు కంప్యూటర్ కోర్స్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. ఈనెల 25 నుంచి మరో బ్యాచ్ ప్రారంభం కానుందని వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు కళాశాలకు నేరుగా వచ్చి లేదా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ల ఫోన్ నెంబర్లు 94911 75498, 98663 55120లో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని, 35 మందికి మాత్రమే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు గుడి సాంబాబు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు శ్రీవై మనీంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

శివ స్వాముల భారీ ఊరేగింపు


భీమడోలులో ఊరేగుతున్న శివ మాలధారులు

భీమడోలు: కార్తీక మాసోత్సవంలో భాగంగా గురువారం స్థానిక గోదావరి కాల్వ గట్టుపై ఉన్న పార్వతీ సమేత భీమేశ్వర స్వామి శివ దీక్షాపీఠానికి చెందిన శివ మాలధారులు భీమడోలులో భారీ ఊరేగింపు నిర్వహించారు. పంచ ఆశ్వవాహనంపై శ్రీస్వామి వారి పార్థివ లింగాన్ని ఉంచి, శివస్వాములంతా శివతాండవం చేస్తూ మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాలుస్తూ గ్రామోత్సవం చేశారు. గ్రామ వీధులు శివ నామస్మరణతో మార్మోగాయి. కార్యక్రమంలో శివ స్వాములు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సబ్సిడీ బకాయిలు చెల్లించాలి


ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఆయిల్‌పామ్, కోకో తదితర మొక్కలు, దొండ పందిళ్లు, ఇతర ఉద్యాన పంటల సబ్సిడీ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) ఎస్ రామ్మోహన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఉద్యాన పంటలకు ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారని, అధిక దిగుబడులు వచ్చే ఆయిల్‌పామ్ విత్తనాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఆయిల్ పామ్ మొక్కలు కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారణకు సామూహిక చర్యలు చేపట్టాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు మార్జిన్ల ఆక్రమణలు తొలగించాలి

గణపవరం: మండలంలోని ప్రభుత్వ భూములు, రోడ్డు మార్జిన్లలో ఉన్న ఆక్రమణల తొలగింపునకు సమాయత్తం కావాలని తహసీల్దార్ వైకేవీ అప్పారావు తెలిపారు. పిప్పర, గణపవరం, సరిపల్లె గ్రామాల్లోనూ, ముఖ్య కూడళ్లలో ట్రాఫిక్ సమస్య పట్టి పీడిస్తోందని, ఆయా ప్రాంతాల్లో ఆక్రమణలు సర్వే చేసి మార్కింగ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, సర్వేయర్లకు సూచించామని చెప్పారు. తదుపరి నోటీసులు జారీ చేస్తామన్నారు.

సెల్ మాట్లాడవద్దని చెప్పటంతో అదృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు అశోక్‌నగర్‌కు చెందిన ఒక యువతిని ఇంట్లో పెద్దలు సెల్‌ఫోన్ ఎక్కువగా మాట్లాడవద్దని హెచ్చరించటంతో ఆమె కుటుంబ సభ్యులతో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఏలూరులోని ఒక మార్ట్‌లో పనిచేస్తుండగా ఆమెను పని మాన్పించటంతోపాటు సెల్‌ఫోన్ అధికంగా మాట్లాడవద్దని చెప్పటంతో ఇల్లు విడిచిపెట్టి బయటకెళ్లి రాలేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

సిగ్నల్ పాయింట్ క్రమబద్ధీకరణకు వినతి


ట్రాఫిక్ సీఐకి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏలూరు పాత బస్టాండ్ వద్ద గల సిగ్నల్ పాయింట్ క్రమబద్ధీకరణ కోరుతూ ఏలూరు ట్రాఫిక్ సీఐ ఎస్ లక్ష్మణరావుకి ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా కమిటీ తరపున చక్రాల అమర్ కుమార్, జె.గోపి, అడ్డాల రాజు (నాని) గురువారం వినతి పత్రం అందజేశారు. సిగ్నల్ పాయింట్ జీబ్రా లైన్, స్టాప్ లైన్ మధ్య దూరం దాదాపు 20 మీటర్లు ఉండడంతో వాహనదారులు గమనించకుండా ఇ చలానాలకు బలైపోతున్నారని తెలిపారు. సిగ్నల్ పాయింట్ వద్ద ఉన్న జీబ్రా లైన్, స్టాప్ లైన్, సీసీ కెమెరాలు క్రమబద్ధీకరించాలని కోరారు. సమస్య పరిష్కారానికి సీఐ లక్ష్మణరావు హామీ ఇచ్చారని యూనియన్ నాయకులు తెలిపారు.

అప్రమత్తతతో మెలగాలి


డీఎస్పీ డీడీ గంగరాజును సత్కరిస్తున్న పోలీస్ అధికారులు

భీమడోలు: సంఘ విద్రోహ శక్తుల పట్ల అప్రమత్తతతో ఉండాలని రాజమండ్రి డీఎస్పీ డీడీ గంగరాజు అన్నారు. భీమడోలు గ్రామ సమీపంలోని బాంబుల దిబ్బ వద్ద గల ఓఎన్‌జీసీ పేలుడు యూనిట్‌ను గురువారం ఆయన సందర్శించారు. యూనిట్‌ని పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సంఘ విద్రోహశక్తుల కదలిలపై నిఘా ఉంచాలని హెచ్చరించారు. ఆయనను సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్సై పి.శ్రీనివాస్, హెచ్‌సీలు ఎం.వెంకట్రావు, బి.శ్రీనివాసరావు, ఎండీ నసీరుద్దీన్, ఎస్ రామారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎన్నిక

గణపవరం: గణపవరం మండల పంచాయతీ కార్యదర్శుల యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్టు యూనియన్ గౌరవాధ్యక్షుడు డి.శివరామ్‌ప్రసాద్ (గణపవరం) తెలిపారు. మండల శాఖ అధ్యక్షుడిగా ఎస్‌వీ నాగేంద్ర కుమార్ (పిప్పర), అసోసియేట్ అధ్యక్షుడిగా దైబాల రామాంజనేయులు (సరిపల్లె), ఉపాధ్యక్షుడిగా సీహెచ్ చంటిబాబు(వెంకట్రాజపురం), ప్రధాన కార్యదర్శిగా ఎం బుజ్జమ్మ (చిలకంపాడు), కోశాధికారిగా ఎం.భాస్కర్ (గణపవరం-3) ఎన్నికయ్యారని పేర్కొన్నారు. వీరిని పలువురు అభినందించారు.

ప్యాడ్లు, పెన్సిళ్ల పంపిణీ

దెందులూరు: కొవ్వలిలో ఉన్న ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో గురువారం 120 మంది విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు పెన్సిల్స్ ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ చైతన్య అందజేశారు. ఏఓ సత్యనారాయణ, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గోల్డెన్ రాజు, హాస్టల్ సిబ్బంది దాత కృష్ణ చైతన్యను అభినందించారు.

ఆధార్ కేంద్రాల తనిఖీ

ఉంగుటూరు: నారాయణపురంలో ఏర్పాటు చేసిన ఆధార్ స్పెషల్ క్యాంప్‌ను గురువారం ఎంపీడీఓ రాజ్ మనోజ్ పరిశీలించారు. ఆధార్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ కేంద్రానికి వచ్చేవారికి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు

ఏలూరు(మెట్రో): రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోపు వారి ఖాతాలకు సొమ్ము జమ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో గురువారం ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై పౌర సరఫరాలు, సహకార, మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో 250 రైతు సేవా కేంద్రాల ద్వారా గత నెల 22 నుంచి నేటి వరకు రూ.136.44 కోట్ల విలువైన 58,102.800 మెట్రిక్ టన్నుల ధాన్యం కొని, రైస్ మిల్లుకు తరలించినట్టు చెప్పారు. ధాన్యం కొనుగోలులో సందేహాలుంటే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 08812-230448, 7702003584, టోల్ ఫ్రీ 18004 256453కు ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.